1st Year
Happy Work Anniversary.

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక




Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 113
బుధవారం 29 ఏప్రిల్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు రాజ్‌నాథ్ సింగ్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 28)

ఉగ్రవాదంపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈసందర్భంగా గతేడాది జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. ఈ ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందన్నారు. దీని అనంతరం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందన్నారు. ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఈసందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా.. ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్ర దాడులను అస్సలు విస్మరించకూడదని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీఓ వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు.

ఈసందర్భంగా ప్రస్తుతం కొనసాగుతోన్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందన్నారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈక్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

## భాజపా సర్కారు ప్రమాణ స్వీకారానికి వస్తా

పశ్చిమ బెంగాల్‌లోని బారక్‌పుర్ ఎన్నికల సభలో ప్రసంగిస్తున్న ప్రధాని



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 28)

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించి తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే నెల 4 తర్వాత తమ పార్టీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి తాను తిరిగి రాష్ట్రానికి వస్తానని పేర్కొన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బ్యారక్‌పుర్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో సిండికేట్ రాజ్‌కు టీఎంసీ నాయకత్వం ▶మిగతా 2లో

## అమరావతి పనులకు ప్రత్యేకంగా పెట్రోల్, డీజిల్ కోరడం చట్టవిరుద్ధం



ఇంధన కొరత వెనుక ప్రభుత్వ హస్తం ఉందన్న సజ్జల
ఇంధనాన్ని అమరావతికి మళ్లించడం వల్లే రాష్ట్రంలో కొరత ఏర్పడిందని ఆరోపణ
రాష్ట్రాన్ని చంద్రబాబు 20 ఏళ్లు వెనక్కి తీసుకెళుతున్నారని విమర్శ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 28)

ఏపీలో పెట్రోల్, డీజిల్ సంక్షోభంపై వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ▶మిగతా 2లో

# విశాఖ ఇకపై 'ఏఐ పట్నం'..
# చంద్రబాబుకు కేంద్రం హ్యాట్సాఫ్

అశ్వినీ వైష్ణవ్ ప్రసంగంలోని హైలైట్స్
విశాఖపట్నంలో 'గూగుల్ ఏఐ డేటా హబ్'కు శంకుస్థాపన
డేటా సెంటర్ ను ప్రధాని త్వరలోనే ప్రారంభిస్తారన్న వైష్ణవ్
జూన్ 1న రైల్వే జోన్ ను అధికారికంగా ప్రారంభిస్తామని వెల్లడి




(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 28)

విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'గూగుల్ ఏఐ డేటా హబ్'కు శంకుస్థాపన జరిగింది. ఈ డేటా హబ్ తో టెక్ రంగంలో ఏపీ రూపురేఖలు మారిపోనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ఐటీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. ఈ సందర్భంగా కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నమ్మకాన్ని చాటిచెప్పింది.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, యువనేత లోకేశ్ కార్యదక్షత కలగలిసి విశాఖను ప్రపంచ ఐటీ పటంలో అగ్రస్థానంలో నిలపబోతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రశంసించారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్ శంకుస్థాపన వేదికగా ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"అప్పట్లో చంద్రబాబు నిర్మించిన సైబర్ టవర్స్ నేడు ఐటీ రంగానికి వెన్నెముకగా నిలిచాయి. ఇప్పుడు అదే స్ఫూర్తితో విశాఖలో నిర్మిస్తున్న ఏఐ డేటా హబ్ ప్రపంచస్థాయి నిపుణులను ఆకర్షిస్తుంది. ఆయన నిజమైన విజనరీ లీడర్" అని కొనియాడారు. ఐటీ మంత్రి నారా లోకేశ్ శక్తిసామర్థ్యాలను వైష్ణవ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రాజెక్టుపై లోకేశ్‌కు ఉన్న స్పష్టత, సమస్యలను పరిష్కరించే తీరు యువ నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు. అలాగే కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లు పార్లమెంట్‌లో ఏపీ గొంతుకగా నిలుస్తున్నారని మెచ్చుకున్నారు. ▶మిగతా 2లో

## బ్లాక్ మార్కెట్ చేసే వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కయింది

కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శిని కలిసిన అవినాశ్ రెడ్డి
రాష్ట్రంలో 70 శాతం పెట్రోల్ బంకులు నో స్టాక్ బోర్డులు పెట్టాయని వెల్లడి
రైతులు, ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 28)

ఏపీలో కొనసాగుతున్న ఇంధన సంక్షోభంపై వైసీపీ తన పోరాటాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకెళ్లింది. పార్టీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ఈరోజు కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్‌ను కలిసి రాష్ట్రంలోని పరిస్థితులపై ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో సుమారు 70 శాతం పెట్రోల్ బంకులు 'నో స్టాక్' బోర్డులు పెట్టాయని, బైక్‌లకు కూడా రూ. 200 కంటే ఎక్కువ పెట్రోల్ పోయని దుస్థితి నెలకొందని ఆయన కేంద్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం మీడియాతో మాట్లాడిన అవినాశ్ రెడ్డి, ప్రజల కష్టాలను తీర్చాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే బ్లాక్ మార్కెట్ చేసే వారితో కుమ్మక్కయిందని సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యంగా రబీ ▶మిగతా 2లో

## ఇంధన కొరత కృత్రిమం.. దోపిడీ కోసమేనంటూ జగన్ ఫైర్



ఏపీలో పెట్రోల్, డీజిల్ కొరత కృత్రిమమేనన్న జగన్
కూటమి నేతలు, డీలర్లు కుమ్మక్కై దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 28)

రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది సహజంగా ఏర్పడిన సంక్షోభం కాదని, కూటమి నాయకులు, పెట్రోల్ బంకుల డీలర్లు కుమ్మక్కై సృష్టించిన కృత్రిమ కొరత అని సంచలన ఆరోపణలు చేశారు. సమస్య వచ్చినప్పుడు దాన్ని అనుకూలంగా మార్చుకుని దోచుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇప్పుడు పెట్రోల్, డీజిల్ విషయంలోనూ అదే జరుగుతోందని విమర్శించారు.ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఇంధన ధరలు పెరుగుతాయనే అంచనాలతో డీలర్లు ఉద్దేశపూర్వకంగా నిల్వలను బ్లాక్ చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ఈ దోపిడీ పర్వంలో వారితో కూటమి నాయకులు జతకట్టి, లబ్ధి పొందేందుకు సిద్ధమయ్యారని అన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలో ఎలాంటి కొరత లేనప్పుడు, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేవని, ఇది పూర్తిగా మానవ సృష్ట సంక్షోభమని జగన్ స్పష్టం చేశారు.ఈ కృత్రిమ కొరత కారణంగా అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రబీ పంటల కోతల సమయం కావడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని అన్నారు. పంట నూర్పిడి యంత్రాలకు రోజుకు 100 నుంచి 160 లీటర్ల డీజిల్ అవసరం కాగా, సరఫరా నిలిచిపోవడంతో యంత్రాలు పొలాల్లోనే ఆగిపోతున్నాయని తెలిపారు. దీనివల్ల రైతులు కోలుకోలేని ▶మిగతా 2లో

## ఐటీలో హైదరాబాద్ కంటే మెరుగ్గా విశాఖను మారుస్తాం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 28)

పదేళ్లలోనే విశాఖ నగరం ఐటీ హబ్‌గా మారుతుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గూగుల్ ఆధ్వర్యంలో విశాఖలో ఏఐ శక్తి కాన్‌క్లేవ్ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొని మాట్లాడారు. "ఐటీ అభివృద్ధిలో హైదరాబాద్ కంటే మెరుగ్గా విశాఖను మారుస్తాం. విశాఖలో పూర్తి ఎకో సిస్టమ్ తయారు చేస్తున్నాం. డేటా సెంటర్లు తేవడమే కాదు.. వాటి నిర్వహణ కూడా కీలకం. పరిశ్రమలను తెచ్చి యువతకు ఉపాధి కల్పించమే మా లక్ష్యం. ఏపీకి వచ్చిన ప్రతి పరిశ్రమకు ప్రభుత్వ అండదండలు ఉంటాయి. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు, సంస్థల పురోగతిపై ప్రతి వారం సమీక్ష చేపడతాం" అని లోకేశ్ అన్నారు.

## ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఎందుకొచ్చింది?: షర్మిల

ఇంధన సంక్షోభంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్ షర్మిల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 28)

రాష్ట్రంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఏర్పడిందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రూ.500 డీజిల్ కోసం ఓ ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావిస్తూ, ఇది రైతులను రక్షించే ప్రభుత్వమా లేక భక్షించే ప్రభుత్వమా అని ఘాటుగా ప్రశ్నించారు. ▶మిగతా 2లో

## పెట్రోల్, డీజిల్‌ను దారి మళ్లించే బంకులపై కఠిన చర్యలు: నాదెండ్ల మనోహర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 28)

బంకుల్లో ఇంధన కొరతపై మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష చేపట్టారు. పెట్రోల్, డీజిల్‌ను దారి మళ్లించే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. పెట్రోల్ బంకుల్లో స్టాక్ ఉన్నా.. లేదని చెప్పే బంకులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బంకుల్లో రేషన్ పద్ధతిని కొనసాగించాలని ఆదేశించారు. బంకుల మూసివేత తగ్గిందని.. కంపెనీల నుంచి సరఫరా పెరిగిందని మంత్రి తెలిపారు. ఆక్వా, వరి రైతులకు ఇంధన కొరత రాకుండా చూడాలని కోరారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పెట్రోల్ బంకులు ఉద్దేశపూర్వకంగా ఇంధనం ఇవ్వడం లేదని టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని.. వాటిపై తక్షణం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జన్మదిన వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 28) మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఎల్ సుధారాణి అధ్యక్షతన, చరిత్ర విభాగం అధ్యాపకులు సిహెచ్ వెంకటేశ్వర్లు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు




జన్మదిన వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దాతృత్వము సహృదయతను, కళా పోషణ, విద్య పట్ల ఆదరణ, గురించి మాట్లాడారు. అమరావతి రాజధానికి పునాదులు వేసిన వారు, బ్రిటిష్ వారిని ఎదిరించి నిలిచిన వారు, వెంకటాద్రి నాయుడు అని కొనియాడారు. ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ బాబురావు మాట్లాడుతూ మంగళగిరి, భట్టిప్రోలు, ఆ ప్రాంతాలలో అనేక దేవాలయాలు నిర్మించారని తెలిపారు. చరిత్ర అధ్యాపకులు మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో చింతలపల్లిని రాజధానిగా చేసుకొని, వారి పూర్వీకులు పరిపాలించినారని, అమరావతి, ధరణికోట పైకి పిండారులు దండెత్తినప్పుడు, వెంకటాద్రి నాయుడు వారిని అణచివేసినారని, వీరి శేష జీవితము అమరావతిలో, అమరలింగేశ్వర స్వామి పాదాల కాడ గడిపినారని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిధుల వినియోగం పారదర్శకంగా ఉండాలి

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 28) ఒంగోలు నియోజకవర్గంలోని కొత్తపట్నం, ఒంగోలు రూరల్ మండలాలలోని పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, ప్రత్యేక అధికారులతో మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గుంటూరు రోడ్డు లోని కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసారు. సమావేశంలో వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధుల వినియోగం పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా త్రాగునీరు, పారిశుద్ధ్యం, మురుగుకాల్వల పారుదల వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు ఆదేశించారు. పంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు, నీటి పన్ను, వ్యాపార సముదాయాల ద్వారా పన్నుల వసూళ్లలో నిక్కచ్చితనం పాటిస్తూ, ఆదాయ వనరులు పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అలాగే వాటర్ ట్యాంకుల అవసరం, పైప్‌లైన్ల నూతన ఏర్పాట్లు, మురుగుకాలువల ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఎన్ఆర్ఈజీఎస్, సీఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండల పరిషత్ అధికారులు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్ ఇంజనీర్, ఇరిగేషన్ , కూటమి నేతల భాగస్వామ్యంతో ప్రజా సేవలో పూర్తి బాధ్యతతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు, ఎంపీడీఓ లు, తహసీల్దార్లు, టీడీపీ మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# విశాఖ ఇకపై 'ఏఐ పట్నం'..

**అశ్వినీ వైష్ణవ్ ప్రసంగంలోని హైలైట్స్:**

"విజనరీ లీడర్ చంద్రబాబు హైదరాబాద్ లో నిర్మించిన సైబర్ టవర్ ఐటీకి ఐకానిక్. గూగుల్ ఏఐ డేటా సెంటర్ తో విశాఖపట్నం ఇక ఏఐ పట్నంగా మారుతుంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ కు సెల్యూట్ చేస్తున్నాను. విద్య, వైద్యం, ఏరోస్పేస్, లాజిస్టిక్స్, వ్యవసాయం ఇలా వేర్వేరు రంగాల్లో ఏఐ విప్లవం వస్తోంది. గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ ద్వారా విశేషమైన సేవలు అందుతాయి. ఎంఓయూ చేసుకున్న అతి తక్కువ సమయంలో గూగుల్ ఏఐ డేటా హబ్ శంకుస్థాపన జరుగుతోంది. ఏఐ డేటా సెంటర్ ను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించుకునే రోజు దగ్గర్లోనే ఉంది. ఐటీ సేవల రంగంలో భారత్ లీడర్ గా ఎదిగింది. మన దేశంలోని నాయకత్వం కీలకంగా వ్యవహరించింది.

గతంలో ఉత్పత్తి రంగంపై భారత్ ముందుకు వెళ్లలేకపోయింది. సెమీ కండక్టర్లు, చిప్, ల్యాప్ టాప్, మొబైల్ ఉత్పత్తుల లాంటి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో వెనుకబడ్డాం. ప్రధాని మోదీ చొరవతో మొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఇప్పుడు ముందడుగు వేశాం. భారత్ నుంచి ఇప్పుడు మొబైల్ ఫోన్లు అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. దేశీయంగా అవసరమైన 50 శాతం ఎలక్ట్రానిక్ పరికరాలను మన దేశంలోనే ఉత్పత్తి చేసుకుంటున్నాం. మేజర్ ఎలక్ట్రానిక్స్ డెవలప్మెంట్, డిజైన్ చేసే దేశంగా భారతదేశాన్ని గుర్తించాలి. సెమీ కండక్టర్ మిషన్ లో భాగంగా ఇప్పటికే వాణిజ్య పరమైన ఉత్పత్తిని ప్రారంభించాం. సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తిలో భారత్ ఎంతో ఎదిగింది.

డేటా సెంటర్లకు అవసరమైన సర్వర్లను కూడా దేశంలోనే ఉత్పత్తి చేసేలా టెక్ కంపెనీలు కృషి చేయాలి. గూగుల్ కూడా తమ సర్వర్లను, జీపీయూ, చిప్ లను ఇక్కడే ఉత్పత్తి చేసేలా చూడాలి. భారతదేశం చేస్తున్న ఈ సూచనను గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కు కూడా తెలియచేయాలని విజ్ఞప్తి. తక్కువ వ్యయంతోనే నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేందుకు వీలుంది. విశాఖ నుంచి 3 సబ్ సీ కేబుల్స్ ను వేస్తున్నందుకు గూగుల్ కు ధన్యవాదాలు. ఆస్ట్రేలియా, మిడిల్ ఈస్ట్ మీదుగా యూరోప్ కు, అఫ్రికా మీదుగా అమెరికాకు వెళ్లేలా ఈ సబ్ సీ కేబుల్స్ వేస్తున్నారు.

డబుల్ ఇంజన్ బులెట్ ట్రైన్ సర్కార్ ద్వారా ఏపీకి రూ. 10,134 కోట్ల రైల్వే బడ్జెట్ ను కేటాయించాం. గతంలో ఉమ్మడి ఏపీకి కేవలం రూ. 886 కోట్లు మాత్రమే బడ్జెట్ ఉండేది. ప్రస్తుతం రూ.1.06 లక్షల కోట్ల రైల్వే ప్రాజెక్టులు ఏపీని కనెక్ట్ చేస్తూ నిర్మాణంలో ఉన్నాయి. దేశంలోనే తొలిసారి నవ నిర్మాణ్ ప్రాజెక్టు ద్వారా ఏపీలో 74 స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం. 832 ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల నిర్మాణం జరిగాయి. 1039 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణం జరుగుతోంది. 100 శాతం ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేసుకున్న రాష్ట్రం ఏపీ.16 వందే భారత్ సర్వీసులు ఏపీలో నడుస్తున్నాయి. 22 అమృత్ భారత్ సర్వీసులు కూడా ఏపీ నుంచి నడుస్తున్నాయి. రైళ్ల డిజైన్, ఉత్పత్తిలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఏపీలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ లాంటి కీలకమైన విభజన హామీని కేంద్రం నెరవేర్చింది.

2026 జూన్ 1 తేదీన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ను అధికారికంగా నోటిఫై చేయబోతున్నాం. అమరావతి నుంచి హైదరాబాద్ కు బులెట్ ట్రైన్ ప్రాజెక్టు కూడా త్వరలోనే సాకారం కాబోతోంది. 70 నిమిషాల్లో అమరావతి నుంచి హైదరాబాద్ కు చేరుకునేలా ఈ ప్రాజెక్టు వస్తోంది. 112 నిమిషాల్లో అమరావతి నుంచి చెన్నైకు చేరుకునేలా బులెట్ ట్రైన్ నిర్మాణం చేస్తాం. అభివృద్ధిలోనూ, సంక్షేమంలోనూ దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుంది. ప్రతిపక్ష పార్టీలు మాత్రం ప్రతీ అంశాన్నీ రాజకీయం చేస్తున్నాయి. కోల్ కోతా నుంచి చెన్నై వరకూ ఉన్న తూర్పు కోస్తా రైల్వే డబుల్ లైన్లను ఫోర్ లైన్లుగా మారుస్తాం. కంటైనర్, ఫ్రైట్ ట్రైన్లతో పాటు 500 రైళ్లతో ఈ ప్రాంతాన్ని అనుసంధానిస్తాం" అని తెలిపారు.

# భాజపా సర్కారు ప్రమాణ స్వీకారానికి వస్తా

వహిస్తోందని, రాష్ట్రంలో రాజకీయ హింస, చొరబాట్లు, ఆర్థిక క్షీణతలకు ఆ పార్టీదే బాధ్యతని ఆరోపించారు. 'రాష్ట్రంలో నేనెక్కడికి వెళ్లినా ప్రజల మనోభావాలను గమనించా. అందుకే మే 4 తర్వాత భాజపా ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి నేను మళ్లీ వస్తానన్న దృఢ విశ్వాసంతో తిరిగి వెళ్తున్నా' అని మోదీ పేర్కొన్నారు. 1857లో జరిగిన దేశ తొలి స్వాతంత్రోద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన బ్యారక్‌పూర్ ప్రాంతం.. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో పరివర్తనకు బాటలు వేస్తోందని తెలిపారు. పూర్వకాలంలో భారత్ సుభిక్షంగా ఉన్న రోజుల్లో దేశానికి అంగ, వంగ, కళింగ అనే మూడు రాజ్యాలు మూల స్తంభాల్లా ఉండేవని.. అవే నేటి బిహార్, బెంగాల్, ఒడిశాలని వివరించారు. ఈ మూడు స్తంభాలూ బలహీనపడినప్పుడు దేశం బలహీనపడిపోయిందని, తూర్పు భారత ఉద్ధరణ జరగకుండా దేశం బలోపేతం కాబోదని మోదీ పేర్కొన్నారు. ఇటీవల బిహార్, ఒడిశాలలో విజయం సాధించిన కమలం ఇక పశ్చిమ బెంగాల్‌లో వికసించబోతోందని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌కు సేవ చేయడం, భద్రత కల్పించడం, పరిరక్షించడం తన బాధ్యత, విధి అని పేర్కొన్నారు.

**ఓటు వేసేముందు ఆ గూండాలను గుర్తు చేసుకోండి**

బెదిరింపులకు, దురుపయోగానికి, అబద్ధాలకు పరిపాలనను టీఎంసీ పరిమితం చేసిందని ప్రధాని ఆరోపించారు. చులకన చేసే మాటలతో వాళ్లు తనపై, రాజ్యాంగ వ్యవస్థలపై, సాయుధ బలగాలపై దాడికి పాల్పడ్డారని చెప్పారు. గడచిన 15 సంవత్సరాల్లో సాధించిందేమిటో ఒక్క టీఎంసీ నాయకుడూ చెప్పలేకపోతున్నాడని వ్యాఖ్యానించారు. 'మీరు ఓటేయడానికి వెళ్లినప్పుడు టీఎంసీ పేరుతో అత్యాచారాలు జరిపే గూండాల ముఖాలు గుర్తు తెచ్చుకోండి.. కమలానికి ఓటేసి మన ఆడ బిడ్డలు అర్ధరాత్రి దాటినా భయం లేకుండా బయటికి వెళ్లేందుకు వీలైన పరిస్థితుల కల్పనకు సాయపడండి' అని మోదీ పిలుపునిచ్చారు. చొరబాటుదార్లను వదిలేది లేదని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన మతువా సామాజిక వర్గానికి పౌరసత్వం, ఇతర పత్రాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**దివ్యానుభూతి పొందా: మోదీ**

పశ్చిమ బెంగాల్‌లో ప్రచారం చేయడం తీర్థయాత్రకు వచ్చినట్లుగా ఉందని ప్రచారం చివరి రోజైన సోమవారం ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాళీ మాత భక్తుల నుంచి అందిన దివ్య శక్తి, ప్రజల నుంచి లభించిన ఆశీర్వాదం తనకు ప్రచారంలో బలాన్ని ఇచ్చాయని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఒక ఆడియో సందేశాన్ని, బహిరంగ లేఖను విడుదల చేశారు. ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేయడంతోపాటు పశ్చిమ బెంగాల్‌లో తాము ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 'తీవ్రమైన వేసవి వేడిలో ప్రచారం చేసినా నాకు ఏమాత్రం అలసట కలగలేదు. ఈ ర్యాలీలు, రోడ్ షోలలో పాల్గొనడం నాకు తీర్థయాత్రకు వచ్చినట్లుగా తోచింది' అని ప్రధాని వ్యాఖ్యానించారు. 'అయోధ్యలో రామ్‌లల్లాకు ప్రాణ ప్రతిష్ఠ చేయడానికి ముందు నేను 11 రోజుల వ్రతాన్ని పాటించా. శ్రీరాముడు నాలో అంతులేని శక్తి నింపిన భావన నాకు ఆనాడు కలిగింది. ఈ ఎన్నికల ప్రచారంలోనూ అదే అనుభూతి కలిగింది' అని పేర్కొన్నారు.

# అమరావతి పనులకు ప్రత్యేకంగా పెట్రోల్, డీజిల్ కోరడం చట్టవిరుద్ధం

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ కొరత వెనుక కూటమి ప్రభుత్వ హస్తం ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో గత నాలుగైదు రోజులుగా ప్రజలు ఇంధనం కోసం అల్లాడుతుంటే ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ అక్కడ లేని ఇబ్బందులు.... కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే ఎందుకు వస్తున్నాయని ఆయన నిలదీశారు. ముఖ్యంగా సివిల్ సప్లై కమిషనర్ రాసిన ఒక లేఖను సజ్జల ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఏప్రిల్ 24న ఆయిల్ కంపెనీలకు రాసిన లేఖలో, అమరావతి పనుల కోసం ప్రత్యేకంగా పెట్రోల్, డీజిల్ కేటాయించాలని కోరడం చట్టవిరుద్ధమని ఆయన మండిపడ్డారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందిస్తూ ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని సూచించిందని అన్నారు. రాజధాని పనుల పేరుతో సామాన్య ప్రజలకు అందాల్సిన ఇంధనాన్ని మళ్లించడం వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని సజ్జల విమర్శించారు. చంద్రబాబు రాష్ట్రాన్ని మరో 20 ఏళ్లు వెనక్కి తీసుకెళుతున్నారని, కనీసం డీజిల్ కూడా సరఫరా చేయలేని ప్రభుత్వం ఇక పరిశ్రమలను ఏం తీసుకువస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించి, తద్వారా పానిక్ బయింగ్‌కు దారితీసేలా ప్రభుత్వమే ఈ కృత్రిమ సంక్షోభాన్ని సృష్టించిందని సజ్జల ధ్వజమెత్తారు.

# బ్లాక్ మార్కెట్ చేసే వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కయింది

కోతల సమయంలో డీజిల్ దొరకక రైతులు, ఏరియేటర్లు నడవక ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమర్షియల్ ఎల్పీజీ ధరలు పెరిగినా బ్లాక్ మార్కెటింగ్ ఆగడం లేదని, ఆయిల్ కంపెనీలు సరఫరాను తగ్గించడం వెనుక ఉన్న ఉద్దేశపూర్వక చర్యలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఏపీకి అవసరమైన ఇంధన నిల్వలను పంపి, పరిస్థితిని చక్కదిద్దాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఎందుకొచ్చింది?: షర్మిల

చంద్రబాబు పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఇది వారి పాలిట శాపంగా పరిణమించిందని ఆమె విమర్శించారు. ఈ మేరకు ఆమె ఓ రైతు ఆక్రోశిస్తున్న ఓ వీడియో పంచుకున్నారు. "కూటమి పాపం.. ఆక్వా రైతన్న పాలిట శాపం. రాష్ట్రంలో ఇంధన సంక్షోభం రొయ్య రైతులకు అంతులేని కష్టం. కంటికి రెప్పలా చూసుకొనే రొయ్య పిల్లలను బ్రతికించేందుకు ఓ పెట్రోల్ బంకు దగ్గర రైతన్న పడిన ఆవేదన వర్ణనాతీతం. రూ. 500 డీజిల్ కోసం ఆ రైతు రోదించిన తీరు చూసి కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలి. "అన్నా నాకు ఫ్యాన్ సీట్లు (ఏరేటర్) తిరగాలన్నా .. అప్పుచేసి రొయ్య పిల్ల వేశాను.. ఫ్యాన్ సీట్లు తిరగకపోతే నా రొయ్య పిల్ల చచ్చిపోద్ది అన్న" రైతన్న ఆవేదన వింటుంటే ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? చంద్రబాబు గారి ఛాతిలో ఉన్నది గుండెనా? బండనా? ఇది రైతన్నను రక్షించే ప్రభుత్వమా? భక్షించే ప్రభుత్వమా? ఇదేనా చంద్రబాబు గారి విజినరీ? దీన్నే అంటారా అద్భుతమైన గుడ్ గవర్నెన్స్?

రైతులతో కాళ్లు పట్టించుకున్న పాపం ఈ కూటమి ప్రభుత్వానికి తగలకపోదు. ఎక్కడా లేని ఇంధన సంక్షోభం ఏపీలోనే ఎందుకొచ్చింది ? ఎన్డీయే పాలిత రాష్ట్రంలో ఇంధనం కోసం ప్రజల పడిగాపులా? పెట్రోల్ బంకుల దగ్గర మల్లయుద్ధాలా? రేషన్ విధానంలో పెట్రోల్, డీజిల్ పోయడమా? సరిపడేంత ఇంధనం ఉంటే దాదాపు 3 వేల బంకుల్లో నో స్టాక్ బోర్డులు ఇవ్వాల్టికి ఎందుకున్నాయి? ఇదేనా రాష్ట్ర ప్రజలపై కేంద్రానికున్న చిత్తశుద్ధి? ఇందుకేనా పడి పడి మోదీజీకి మద్దతు ఇచ్చేది?

బంకుల దగ్గర జనాలు అవస్థలు పడుతుంటే, ప్రత్యక్షంగా అన్నీ రంగాలపై ఇంధన సంక్షోభం తీవ్ర పరిణామాలు చూపిస్తుంటే, ఇంకా బీజేపీ భజన చేయడానికి, మోదీగారి తొత్తుగా ఉండటానికి చంద్రబాబు గారు సిగ్గుపడాలి. రాష్ట్రంపై బీజేపీకి పట్టింపు లేదనడానికి ఇంధన సంక్షోభం ఒక నిదర్శనం. వదంతులు నమ్మొద్దని చెప్పే బదులు... ఇప్పటికైనా కళ్లు తెరవండి చంద్రబాబు గారు" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ఇంధన కొరత కృత్రిమం.. దోపిడీ కోసమేనంటూ జగన్ ఫైర్

నష్టాలను చవిచూస్తున్నారని వివరించారు. అలాగే, ఆక్వా రంగంలో ఏరియేటర్లు నడిపేందుకు డీజిల్ అందక రొయ్యలు, చేపల రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ తీవ్రమైన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ఒక సమగ్ర సమీక్ష కూడా నిర్వహించకుండా, కేవలం మీడియాకు లీకులిస్తూ కాలయాపన చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. సరఫరా తగ్గుతుందనే భయంతో ప్రజలే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. గతంలో విత్తనాలు, ఎరువులు, యూరియా నుంచి వంట గ్యాస్ వరకు ఇలాగే కృత్రిమ కొరత సృష్టించి చంద్రబాబు లబ్ధి పొందారని, ఇప్పుడు ఆ జాబితాలో పెట్రోల్, డీజిల్‌ను చేర్చారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పరిస్థితిని చక్కదిద్దాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, తగిన గుణపాఠం చెబుతారని జగన్ హెచ్చరించారు.

# దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

## మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 28) దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభలు మే 3న విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయం నందు నిర్వహిస్తున్నందున నియోజకవర్గంలోని దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ కోరారు. మంగళవారం కనిగిరిలోని దరిశి చెంచయ్య భవన్ నందు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభల కరపత్రాలను వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి జిపి రామారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ప్రజలకు సుప్రీంకోర్టు తీరని అన్యాయం చేస్తుందని మతం మారినంత మాత్రాన కులం మారుతుందా అని అన్నారు దళితులు క్రైస్తవ మతం పుచ్చుకుంటే రిజర్వేషన్లు తీసేస్తామంటూ ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయని ఎస్సీ ఎస్టీ హోదా కూడా పూర్తిగా రద్దు అవుతుందని చెప్పటం శోచనీయమని అన్నారు అంటరానితనం వివక్ష నేటికి గ్రామాలలో పట్టణాలలో విలయతాండం ఆడుతుందని వాటిని నిర్మూలించడంలో ప్రభుత్వాలు విఫలం చెందియ్యని అన్నారు, బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో వచ్చి 15 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఉద్యోగ కల్పన చేయడం మానేసి ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు ఫారం చేస్తున్నాయని దియబెట్టారు ప్రభుత్వం ఎటువంటి బాధ్యతను నిర్వర్తించకుండా ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు దేశంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నప్పుడు ప్రైవేట్ రంగంలో కూడా దళిత ప్రజలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన చూసించారు ఇక ఆంధ్రప్రదేశ్లో గత వైసిపి ప్రభుత్వం 27 పథకాలు దళితులకు రద్దయాయని గగ్గోలు పెట్టిన చంద్రబాబు నాయుడు మేము అధికారంలోకి వస్తే ఆ పథకాలను పునర్దరిస్తామంటూ ప్రగల్భాలు పలికి పగ్గాలు చేపట్టంగానే ఆ మాటను గాలికి వదిలేసారని ఎద్దేవా చేశారు ఈ కార్యక్రమంలో బండితిరుపాలు, యోహాన్, సాల్మన్, తాహిద్, ఇఫ్రాజ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలు బంకును తనిఖీ చేసిన ఎస్ఐ సుబ్బారావు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 28) మండలంలోని మన్నేటికోట జంక్షన్ సమీపంలోని ఎన్ హెచ్ 16 పై ఉన్న బిపిసిఎల్ పెట్రోల్ బంకును మంగళవారం స్థానిక ఎస్ఐ జి సుబ్బారావు తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అక్కడ పెట్రోలు, డీజిల్ అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి సమస్యలు లేవని మండల తహసిల్దార్ ఏవి రవిశంకర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

29.04.26 బుధవారం




## ప్రజా దర్బార్‌లో 90 శాతం సమస్యలు పరిష్కారం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 28)**

మంగళవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి క్యాంపు కార్యాలయం నందు జరిగిన ప్రజా దర్బార్‌లో 120 అర్జీలు రాగా 90 శాతం అర్జీలు పరిష్కారమయ్యాయని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మార్కాపురం నియోజవర్గ స్థాయి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు ఈ ప్రజా దర్బార్‌లో పాల్గొని ప్రజా సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ అధిష్టానం ఇచ్చిన ఆదేశంతో ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఈ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని అన్నారు. మంగళవారం ప్రజా దర్బార్‌కి సుమారు 120 అర్జీలు వచ్చాయని వాటిలో 90% అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించామన్నారు. ఎక్కువగా రెవిన్యూ సమస్యల పై అర్జీలు వచ్చాయని వీటిలో కొన్ని ఇటీవల రీసర్వే చేసిన గ్రామాలలో వచ్చాయన్నారు. వాటిని కూడా సామరస్యంగా పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ మార్కాపురంలో గంజాయి, సైబర్ నేరాలను అరికట్టడానికి పోలీస్ శాఖ వారు తమ సొంత నిధులతో గంజాయి, సైబర్ నేరాల పై సమాచారం ఇచ్చిన వారికి రూ.10 వేలు పారితోషకంగా ఇస్తారని, వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతారని అన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించి మార్కాపురం పట్టణాన్ని గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

(తరువాయి 4లో...)

## వంద రోజుల్లో 6 లక్షల కనెక్షన్లు పూర్తి చేయాలి

### ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 28)**



రాష్ట్రంలో వంద రోజుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించే 6 లక్షల పీఎం సూర్యఘర్ కనెక్షన్లను పూర్తి చేయాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం నాడు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, నెడ్ క్యాప్ వీసీఎండీ కమలాకర్ బాబు, పీఎం సూర్యఘర్ కాంట్రాక్టర్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన గడువు లోపు పీఎం సూర్యఘర్ పనులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రానున్న మూడు నెలల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించే సూర్యఘర్ కనెక్షన్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి డిస్కం పరిధిలో రోజుకు కనీసం 2 వేల సూర్యఘర్ కనెక్షన్లు పూర్తి చేసే విధంగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో పీఎం సూర్యఘర్ పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోందని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా గుత్తేదారులు పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సూచించారు.

## జలవనరుల శాఖ మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

వరద కాల్వల ఆధునికరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

పనులు వేగవంతం చేయాలని సూచన

ఎన్ఎస్పి, కేడబ్ల్యూడీ, ఓ అండ్ ఎం పనులకు నిధులివ్వండి:ఏలూరి

జలధార పథకాన్ని అన్ని చెరువులకు విస్తరించాలని విజ్ఞప్తి

వేసవిలోగా పనుల పూర్తి అసలు చర్యలు తీసుకోండి





## మార్కాపురం వైద్యబృందాన్ని అభినందించిన కలెక్టర్ పి రాజాబాబు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 28)**

మార్కాపురం బస్సు ప్రమాద బాధితులకు పూర్తి స్థాయిలో, సకాలంలో వేగంగా వైద్యం అందించిన జిజిహెచ్ వైద్య బృందాన్ని, సిబ్బందిని జిల్లా కలెక్టర్ రాజాబాబు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. వివిధ రకాల తీవ్రమైన గాయాలతో జిజి హెచ్ కు వచ్చిన వారిని క్యాజువాలిటీలో చేరిన నాటి నుంచి శ్రద్ధ వహించారని జిల్లా రెవిన్యూ అధికారి బి చిన ఓబులేసు చెప్పారు. మార్కాపురం బస్సు ప్రమాద బాధితులు అందరూ డిశ్చార్జ్ అయిన నేపథ్యంలో జి జి హెచ్ సూపరెంటెండెట్ ఛాంబర్ లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను డిఆర్ఓ వెల్లడించారు. మర్చి నెల 26 జరిగిన మార్కాపురం బస్సు ప్రమాదంలో గాయపడిన 17 మంది చికిత్స కోసం జిజిహెచ్‌లో చేరారు. వీరందరికీ డాక్టర్లు వెంటనే స్పందించి వైద్యం అందించారని, జిల్లా కలెక్టర్ రాజాబాబు మార్కాపురం బస్సు ప్రమాద ప్రాంతం నుంచి పర్యవేక్షించారని, జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రత్యక్షంగా వైద్యం అందుతున్న తీరును పరిశీలించారని అయన తెలిపారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ తో పాటు ఆయా విభాగాధిపతులు, వైద్యులు, సిబ్బంది అందరూ శ్రద్ధతో వైద్యం చేసారని, ఒక్క మరణం కూడా లేకుండా వైద్యం అందించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. పేషెంట్ శ్రీహరిని మాత్రం గుంటూరు జిజిహెచ్‌కు రెఫెర్ చెయ్యగా అయన కూడా పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యారన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ జిజిహెచ్ సూపరెంటెండెంట్ మరియు వైద్యులను పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు అని డిఆర్ఓ తెలిపారు. ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో గౌరవ ప్రజా ప్రతినిధుల చొరవను అభినందిస్తున్నామన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్,

(తరువాయి 4లో...)

## కందుల వసంతలక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 28)**

మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి జన్మదిన వేడుకలు పట్టణంలోని వారి నివాసంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ ఆధ్వర్యంలో వారి నివాసంలో వసంతలక్ష్మికి శాలువా కప్పి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకులను తనిఖీ చేసిన జేసీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 28)

ప్రకాశం జిల్లాలో పెట్రోల్, డీజీల్ సరఫరా పరిస్థితి పర్యవేక్షణలో భాగంగా మంగళవారం ఉదయం నాగులుప్పలపాడు మండల కేంద్రం పరిధిలో ఉన్న శ్రీ బాలాజీ ఇండియన్ ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ బంకు యాజమాన్యంతో మాట్లాడుతూ స్టాక్ ఎంత ఉందని, బుక్ చేశారా, ఎప్పుడు వస్తుందని అడిగి తెలుసుకోవడం జరిగింది. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించుకుండా పెట్రోల్, డీజల్ పట్టాలని ఆదేశించారు.

# శక్తి యాప్, డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 28)

బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయం ఆధ్వర్యంలో చీరాల వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ నేతృత్వంలో శ్రీ మేధావి జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి టీమ్ ఎస్ఐ హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావు పాల్గొని శక్తి యాప్ వినియోగం, మాదకద్రవ్యాల ప్రమాదాలు, "డ్రగ్స్ వద్దు బ్రో" ప్రచారం, పోక్సో చట్టం పై వివరించారు.

అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని సుబ్బారావు తెలిపారు.

యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. వేటపాలెం ప్రాంతంలో డ్రగ్స్‌పై నిఘ మరింత కట్టుదిట్టం చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కాపురం వైద్యబృందాన్ని అభినందించిన కలెక్టర్ పి రాజాబాబు

డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌రావు, ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, బి ఎన్ విజయ్ కుమార్, ఉడా చైర్మన్ షేక్ రియాజ్ క్షతగాత్రులను పరామర్శించి, వారికి సత్వర వైద్య సేవలు అందించేందుకు తోడ్పడ్డారని తెలిపారు. అదే విధంగా ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రత్యేకంగా సూపరెంటెండెంట్ వారిని పిలిపించుకొని వైద్యం అందుతున్న తీరును తెలుసుకొని పలు మార్లు వారి గురించి వాకబు చేశారన్నారు. లివర్ గాయం, కాలికి ఫ్రాక్చర్‌తో బాధపడుతున్న వారికి తొలి రోజే శస్త్ర చికిత్స అందిచామన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం కూడా అందించినట్లు చెప్పారు. సూపరింటెండెంట్ మాణిక్యరావు మాట్లాడుతూ ఇలాంటి తీవ్రమైన కేసులను విజయవంతంగా పూర్తి చేసిన జిజి హెచ్ వైద్యులను, సిబ్బందిని, ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఇది మా నిబద్ధతకు నిదర్శనం అని తెలిపారు. ఇలాంటి ట్రీట్మెంట్ కు ప్రైవేట్ వైద్యశాలలో రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుంది అన్నారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు జిల్లా రెవిన్యూ అధికారి, జిల్లా వైద్య అధికారి నిరంతరం తమతో సంప్రదించి తోడ్పాటు అందించారన్నారు. జిల్లాలో ఎలాంటి విపత్తులు ఎదురైనా వేగంగా స్పందించి వైద్యం అందించటంలో జిజిహెచ్ ఎల్లప్పుడూ ముందు ఉంటుంది అని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ సమావేశంలో సిఎస్ఆర్ఎమ్ మాధవిలత, అడ్మినిస్ట్రేటర్ అద్దెయ్య, డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



# ప్రజా దర్బార్‌లో 90 శాతం సమస్యలు పరిష్కారం



# భవన నిర్మాణానికి భూమి కేటాయించండి

## కలెక్టర్ విజయ సునీతను కోరిన పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 28)



పొదిలి పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డు, కార్యాలయ భవనం కు స్థలం కేటాయించాలని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతను పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదిలిలో ఎటువంటి వ్యవసాయ మార్కెట్ యార్డ్, కార్యాలయ భవనం లేకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డ్, కార్యాలయ భవనం నిర్మించాలన్నారు. అందుకు తగిన స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. సర్వేనెంబర్ 57, 51-1,47-13 బి లలో మొత్తం 14 ఎకరాల 71 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. దానిలో నుండి 5 ఎకరాల భూమిని మార్కెట్ యార్డ్ కోసం కేటాయించాలని ఆయన కలెక్టర్‌ను అభ్యర్థించారు. పొదిలి ప్రాంత రైతులకు మార్కెట్ యార్డ్ అందుబాటులోకి వస్తే వ్యవసాయ, వాణిజ్యం మెరుగుపడుతుందని వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు గిద్దలూరి శ్రీకాంత్, షేక్ యాసిన్, తదితరులు ఉన్నారు.



# ఘనంగా ముగిసిన శ్రీ అంకమ్మ తల్లి గుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 28)

మండలంలోని అనమనమూరు గ్రామంలో అత్యంత ఆర్భాటంగా నిర్వహించిన శ్రీ అంకమ్మ తల్లి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు సర్పంచ్ సంఘం అధ్యక్షులు జంపు హరిబాబు ఆధ్వర్యంలో చివరి ముగింపు రోజున ఘనంగా ముగిసాయి. రాత్రంతా విద్యుత్ ప్రభలు, కోలాటాలు, సాంస్కృత కార్యక్రమాలు కనుల పండగగా జరిగాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంపు హరిబాబు మాట్లాడుతూ కార్యక్రమానికి సహకరించిన దాతలు, గ్రామస్తులు, పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరి సహకారంతోనే ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగిందని హరిబాబు తెలియజేశారు.

# జిల్లా ఎస్పి సూచన, సిఐ ఆలోచన... ఆకట్టుకుంటున్న అనౌన్స్మెంట్

## రోడ్డు భద్రత, ప్రమాదాల పై అవగాన పై మైక్ అనౌన్స్మెంట్ పెద్ద బస్టాండ్ సర్కిల్లో ఏర్పాటు








(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 28)

పొదిలి పట్టణంలో స్థానిక సిఐ టి రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రమాదాల పై అవగాహన కొసం ఏర్పాటు చేసిన అనౌన్స్ మెంట్ వాహనాదారులను ఆకట్టుకుంటుంది. హెల్మెట్ వాడకపోవడం వల్ల వచ్చే నష్టం, మైనర్లు డ్రైవింగ్ చేయడం వల్ల వచ్చే ప్రమాదం, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమింగ్ ఆడటం వల్ల వచ్చే నష్టాలను వివరిస్తు ఆనౌన్స్‌మెంట్ ఏర్పాటు చేశారు. ఆనౌన్స్ మెంట్ పై వాహనదారులు ప్రజలు ఆవగాహన పెంచుకుంటున్నారు. ప్రజలను మేల్కొల్పే ఇలాంటి వినూత్న ఆలొచనలు మరెన్నో చేసి ప్రజలను ప్రమాదాల బారి నుండి రక్షించాలని పలువురు కోరుతున్నారు. వినూత్నంగా ఆలోచన చేసి ప్రజలకు ప్రమాదాల పై ఆవగాహన కల్పిస్తున్న పొదిలి సిఐ రాజేష్‌కుమార్‌ను ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# హంతకులను కఠినంగా శిక్షించాలి

## ఏపీజేఫ్ జిల్లా అధ్యక్షులు పి దిలీప్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 28)

చిత్తూరు జిల్లాలో ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు జగన్మోహన్‌రెడ్డిని దుండగులు హత్య చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పీర్ల శివ రాజేష్, పి దిలీప్, జిల్లా ప్రధాన కార్యదర్శి నందం నరేష్‌లు సంయుక్తంగా ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటన పై రాష్ట్రంలోని జర్నలిస్టులంతా తమ నిరసనను వ్యక్తం చేయాలని కోరుతున్నామన్నారు. ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యకు పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 28)

మండలంలోని చిన్నగంజాం శాఖా గ్రంధాలయం నందు మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం 2026 ను గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీ మోహన నరసింహాచార్యులు అధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్ నరసింహారావు, రాజు బంగారు పాలెం హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీ ఆర్ ఎస్ వి పి రాజు, అడవివీధి పాలెం ఉపాధ్యాయులు రామాంజనేయులు ప్రారంభించారు. ముందుగా జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్ నరసింహారావు, రాజుబంగారుపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్ఎస్‌విపి రాజు రిబ్బన్ కట్ చేసి వేసవిజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజు కంప్యూటర్లో శిక్షణ, పుస్తక పఠనం, అలాగే డ్రాయింగ్, వ్యక్తిత్వ వికాసం వంటి వాటిల్లో శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి వేసవిలో ఈ శిక్షణా తరగతులను ఉపయోగించుకుని జ్ఞాన సమపార్జన పొందాలని వారన్నారు. అనంతరం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులచే తెలుగు పద్యములను పిల్లలచే చెప్పించి వాటి అర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్ నరసింహారావు, రాజుబంగారుపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్ఎస్‌విపి రాజు, గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీమోహన నరసింహాచార్యులు, పి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





# ఆకివీడు మాలల గొంతెనమ్మ గుడి కూల్చిన కూటమి ప్రభుత్వం

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్, రఘురామకృష్ణం రాజు ఆకివీడు పాస్టర్ ఇస్మాయిల్ పై రౌడీ షీట్ ఓపెన్ చేయించిన కసాయి డిప్యూటీ స్పీకర్ పదవి నుండి తొలగించాలి దళిత నేత నీలం డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 28)**



ఆకివీడులో మాలల గొంతెనమ్మ గుడిని అర్ధరాత్రి కూటమి ప్రభుత్వం హైకోర్టు స్టే ఉన్నప్పటికీ అక్రమంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు దగ్గర ఉండి పోలీసు రెవెన్యూ అధికారులతో మౌకాళ్లకు మాస్కులు కట్టుకొని కూల్చి వేయించటం వెనక సనాతన చంద్రబాబు,పవన్ కళ్యాణ్‌లు ఉన్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆరోపించారు. మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఆకివీడు మాల పేట లో గొంతెనమ్మ గుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు,సనాతన స్టార్ పవన్ కళ్యాణ్ కను సన్నల్లోనే రాజ్యాంగ చట్టాలను అమలు చేయాల్సిన స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పోలీసు,రెవెన్యూ, మున్సిపల్ బలగాలతో ముఖానికి మాస్కులు వేసుకొని దొంగల్లాగా ఆదివారం అర్ధరాత్రి కూల్చి వేయించటం చంద్రబాబు ప్రభుత్వం మాలలపై యుద్ధం ప్రకటించటమేనని దళితనేత నీలం నాగేంద్రరావు నిప్పులు చెరిగారు.. హైకోర్టులో ఆకివీడు గొంతేనమ్మ గుడి తొలగింపు పై స్టే ఆర్డర్స్ ఉన్నప్పటికీ హైకోర్టు స్టే ఆర్డర్ ను కూడా వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు దగ్గర ఉండి హైకోర్టు ఉత్తర్వులు ఎగతాళి చేస్తూ గొంతెనమ్మ గుడిని కూల్చివేయటం హైకోర్టును ఛాలెంజ్ చేయడమే అన్నారు. అనాగరికులు,వేలిముద్ర గాళ్లు,చట్టాలు తెలియనివాళ్లు ఏదైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిని కోర్టు క్షమించవచ్చు కానీ అసెంబ్లీలో చంద్రబాబు,పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో డిప్యూటీ స్పీకర్ గా చట్టాలపై రూలింగ్ ఇచ్చే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు హైకోర్టు స్టే ఆర్డర్ ను గౌరవించకపోవడం హైకోర్టు నే కాదు రాజ్యాంగ చట్టాలను కూడా పట్టించుకోని మనువాద ఉన్మాది అని నీలం మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో ని మాల పేటలో గొంతెనమ్మ గుడి కూల్చివేత వెనక రెండు ఎకరాల క్రైస్తవ మిషనరీ స్థలాన్ని కబ్జా చేయడానికి పన్నిన కుట్ర అన్నారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టు రెండు ఎకరాల భూమి కబ్జా తో పాటు రాముడు గుడి పేరుతో కోట్ల రూపాయలు వసూళ్లు చేసి కుల మత విద్వేషాల ను రెచ్చగొడుతున్నారు అని అన్నారు. మాలల గొంతెనమ్మ గుడి స్థానంలో రాముడు గుడి కట్టాలంటూ మున్సిపాలిటీ చేసిన తీర్మానంలో మొత్తం 20 మంది కార్పొరేటర్లు ఉండగా 7 గురు తెలుగుదేశం,13 మంది వైసీపీ కార్పొరేటర్లు ఉండగా 1 తెలుగుదేశం మాల కార్పొరేటర్ మాత్రమే గొంతెనమ్మ గుడి కూల్చివేత నిర్ణయాన్ని వ్యతిరేకిచ్చిందన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆకివీడు మాలపేటలోకి పోలీసు,రెవెన్యూ బలగాలతో వెళ్లి అరాచకం సృష్టించి బొట్టు లేని మహిళలు మేకులతో సూదులతో హత్య ప్రయత్నం చేశారంటూ పట్టపగలు ఆకివీడు మాలలపై పదో తరగతి చదువుతున్న పిల్లలపై మహిళలపై అత్యాయత్నం కేసులు పెడితే ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్రంగా ఖండించి అమాయక మాలలను అరెస్టు చేయించారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను గమనించిన హైకోర్టు వెంటనే వారికి బెయిల్ ఇచ్చిందన్నారు. మాలల మేనమామ అంటున్న ప్రతిపక్ష నేత వైయస్సార్ పార్టీ అధ్యక్షుడు జగన్ ఆకివీడు ఘటనని సందర్శించలేదన్నారు. అలాగే "సంబరాల రాంబాబు, " అంబటి రాంబాబు తదితరులు అరెస్టు అయినప్పుడు వాళ్ళ ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మరికొందరు అరెస్ట్ అయినప్పుడు జైల్లోకి వెళ్లి ముద్దులు పెట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆకివీడు మాలల ఆత్మ గౌరవం పై కూటమి ప్రభుత్వం దాడి చేస్తే మౌనం వహించారన్నారు. మాల మహానాడు పేరుతో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మీజ పదవులు పొందిన జూపూడి ప్రభాకర్ రావు మరియు మాల పేరుతో ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవులు ఎంజాయ్ చేసిన కారం శివాజీ, మారుమూడి విక్టర్ ప్రసాద్ లు ఆకువీడును ఎందుకు సందర్శించలేదన్నారు. మాల మహాసభ జాతర మాల వనభోజనాల నాయకులు మల్లెల వెంకట్రావు మరియు గోళ్ళ అరుణ కుమార్ కూడా ఆకివీడు మాల పేటపై కూటమి ప్రభుత్వ దాడి పై నోరెత్తలేదన్నారు. అలాగే మాల జాతీయ నాయకులని అంటూ మెడలో బులుగు కండువాలు వేసుకొన్న మాల నాయకులు ఫేస్బుక్లో కూడా మాట్లాడటం లేదని అన్నారు. మాలలపై 1997వ సంవత్సరంలో ఎస్సీ వర్గీకరణ విషయంలో సెక్రటేరియట్ వద్ద చంద్రబాబు ప్రభుత్వం ఇద్దరు మాలల ప్రాణాలు బలిగొని వందల మంది మాలల రక్తం రుచి చూసిన మాల విద్వేషి చంద్రబాబు అని అన్నారు. చంద్రబాబు నాయుడు కనుసనల్లోనే ఆకివీడు మాలలపై దాడి జరిపి అక్రమ అరెస్టులు చేసి గొంతేనమ్మ గుడిని కూల్చివేసేరన్న సత్యాన్ని మాలలందరు గ్రహించాలన్నారు. ఆకివీడు మాల పేట పై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు దాడి అక్రమ కేసులు మాలల అరెస్టులు ఆదివారం అర్ధరాత్రి గొంతేనమ్మ గుడి కూల్చివేత పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుట్ర ఉందన్నారు. ముస్లిం మతస్థుడైయుండి క్రైస్తవ మతం పాస్టర్‌గా పనిచేస్తున్న ఇస్మాయిల్ అతనిపై మాలలకు అండగా ఉన్నాడనే కక్షతో స్థానిక పోలీస్ స్టేషన్లో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు రౌడీ షీట్ ఓపెన్ చేయించడం కూటమి ప్రభుత్వ హిందుత్వానికి సనాతన ధర్మానికి దర్పణం అన్నారు. వేలాది కోట్లు పేద ప్రజల బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును అక్రమ వ్యాపారాల పేరుతో లూటీ చేసిన రఘురామకృష్ణంరాజును డిప్యూటీ స్పీకర్ పదవి నుండి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం మాదిగ భూ పోరాట సమితి కన్వీనర్ బొమ్మల వంశీ, సమతా దళ్ కన్వీనర్ మేడికొండ మురళి, యానాది పరిరక్షణ సమితి కన్వీనర్ కోలా జీవరత్నం, మాల హక్కుల వేదిక కన్వీనర్ దేవరపల్లి గోపి తదితరులు ఉన్నారు.

# అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యం

## ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు







**(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 28)**

దర్శి పట్టణంలో ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాల కట్టడమే లక్ష్యంగా ఆర్టీసీ బస్టాండ్, ఫుడ్ కోర్ట్స్, పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా పోలీసులు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ పర్యవేక్షణలో దర్శి సీఐ వై రామారావు, ఎస్ఐ మురళి, సిబ్బంది కలిసి ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్, హోటల్‌లు, బేకరీలు, పరిసర ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో డాగ్ స్క్వాడ్, పేలుడు పదార్థాలు కనుక్కునే జగిలాం చీత, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా మాదకద్రవ్యాలను గుర్తించే జాగిలం 'రాక్సీ, బాంబు స్క్వాడ్‌తో పాటు పోలీస్‌లు పాల్గొన్నారు. దర్శి ఆర్టీసీ బస్టాండ్, హోటల్, బేకరీలు, పార్శిల్ సెంటర్లలో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలు, ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో అనుమానాస్పద వస్తువులు, అపరిచిత లగేజీలను గుర్తించేందుకు బస్టాండ్ ఆవరణ, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. అనుమానం కలిగిన ప్రయాణీకుల బ్యాగులను ప్రత్యేకంగా ఓపెన్ చేయించి తనిఖీ చేశారు. మాదక ద్రవ్యాలకు గుర్తించే జాగిలం రాక్సీతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద పార్శిళ్లు కనిపించిన వెంటనే లేదా గుర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎ
ిటిష్టమైన భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.





# జర్నలిస్టుల ఊపిరి తీస్తే ఊరుకోం

## బద్వేల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ భూమిరెడ్డి వెంకటేష్

## బద్వేల్‌లో జర్నలిస్టుల నల్ల బ్యాడ్జీల నిరసన

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 28)**

చిత్తూరు జిల్లా వి కోటలో ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్‌రెడ్డిని అమానుషంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ, బద్వేల్ వర్కింగ్ జర్నలిస్ట్ మీడియా ప్రతినిధులు భూమిరెడ్డి వెంకటేష్, సుదర్శన్‌రెడ్డి, జింకా జానీ, ఆవుల కిషోర్, ప్రసాద్‌తో పాటు పలువురు మంగళవారం సాయంత్రం భారీ నిరసన చేపట్టారు. జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులను ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిరసన ర్యాలీ, పట్టణంలోని ప్రధాన కూడలి అయిన ఫోర్ రోడ్ సర్కిల్ మీదుగా అర్బన్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బద్వేల్ వర్కింగ్ జర్నలిస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణ చట్టం అమలు చేయాలని, జగన్మోహన్‌రెడ్డిని హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ రామకృష్ణను కలిసి మీడియా మిత్రులందరూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలోని అక్రమాలను ఎత్తిచూపే జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు వంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. మాఫియా శక్తుల ఆగడాలకు బలైపోయిన జగన్మోహన్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బద్వేల్ వర్కింగ్ జర్నలిస్టులు హుస్సేన్, దేవిరెడ్డి సురేష్, ఉప్పలపాటి రఘురాములు, వెంకటేష్, వల్లంకొండు వెంకటరమణ, యస్ సుబ్బారావు, మస్తాన్‌రెడ్డి, గురునాథ్, వెంకటసుబ్బయ్య, అరుణ్ కుమార్, అనిల్, రవి, ఆవులేటి శేఖర్, సుభాష్, ఓబులేష్, కట్టారు రామయ్య, కాలువ నాగరాజా, చీదెళ్ల వెంకటసుబ్బయ్య, రవి చిన్న, రాజు అయ్యవారయ్య, సురేష్, నరసింహ, కొలిశెట్టి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారి చేతుల మీదుగా సిఐ రామకృష్ణకు వినతిపత్రం అందజేయడం జరిగింది. మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, వ్యవసాయ కార్యదర్శి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వెంకటేష్ బాల, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోండి ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు రామిరెడ్డి




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 28)**

కనిగిరిశాఖా గ్రంధాలయం నందు 40 రోజుల పాటు జరిగే ఉచిత వేసవి శిక్షణా తరగతులను కనిగిరి ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు, వెలిగండ్ల ఎంఈవో రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వేసవి శిక్షణా తరగతులు విద్యార్థిని, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, విద్యకు సంబంధించిన అనేక అంశాలను 40 రోజుల పాటు నేర్చుకోవచ్చని, ఇందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించి లైబ్రరీలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులకు పంపించాలని ఆయన పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు గయాజ్ భాష మాట్లాడుతూ విద్యార్థులకు ఈ వేసవి శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని, ఈ కార్యక్రమంలో ఆటలు, పాటలు, మ్యాజిక్, కథలు, స్పోకెన్ ఇంగ్లీష్ రైటింగ్ స్కిల్స్, తదితర అంశాలను నేర్పించడం జరుగుతుందన్నారు. ఇందులో జన విజ్ఞాన వేదిక భాగస్వామ్యం అవుతుందన్నారు. విద్యార్థిని, విద్యార్థులు చక్కగా ప్రతి రోజు వచ్చి ఈ వేసవి శిక్షణ శిబిరం ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరుగుతుందన్నారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించబడుతుందని విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ రహిమాన్, మస్తాన్ బాబు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి, కనిగిరి గ్రంథ పాలకుడు అహ్మద్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కథల పుస్తకాలు చదువుకున్నారు.

# విలేఖరిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

## ప్రకాశం జిల్లా డిఆర్ఓ ఓబులేసుకు వినతి పత్రం అందించిన ఏపీడబ్ల్యూజే నాయకులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 28)**

చిత్తూరు జిల్లా వీకోట ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్‌రెడ్డిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏపీడబ్ల్యుఏ నాయకులు మంగళవారం ప్రకాశం జిల్లా డిఆర్ఓ ఓబులేసును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీగంధం మాఫియా పై వార్తలు రాసినందుకు కిరాతకంగా హత్య గావించబడ్డ జగన్మోహన్‌రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. హత్యకు సంబంధించి లోతైన దర్యాప్తును చేపట్టి ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు కుట్రదారులను కూడా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో మరెక్కడ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. డిఆర్ఓను కలిసిన వారిలో ఏపీడబ్ల్యూజే ప్రకాశం జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య, ఏపీడబ్ల్యూజే నాయకులు ఇఫ్తేకర్ భాష, ఎస్ కోటిరెడ్డి, అల్లూరి శ్రీనివాసరావు, కోటయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం – ఇద్దరి మృతి





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 28)**

మార్కాపురంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఇద్దరిని బలితీసుకుంది. బోడపాడు పొలాల్లో పిడుగు పడటంతో ఒంటేరు పోలమ్మ అక్కడికక్కడే మృతిచెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అదే గ్రామంలో ఈదురు గాలులకు కోళ్ల ఫారం షెడ్డు కూలింది. ఈ ఘటనలో చింతకుంట్ల కుమారి ప్రాణాలు కోల్పోయింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# కార్మిక హక్కుల పరిరక్షణ కై మే డే ని జయప్రదంచేయండి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 28)
మే డే స్ఫూర్తితో కార్మికహక్కుల పరిరక్షణకు కార్మికవర్గంలో చైతన్యం కల్పించేలా వాడవాడలా ఎర్ర జెండాల ఆవిష్కరణలు చేయాలని సిఐటియు ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు పొదిలి మండల సమన్వయకమిటి సమావేశం సిఐటియు మార్కాపురం జిల్లా ఉపాధ్యక్షులు నర్రా వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికవర్గం శతాబ్ధకాలంగా పోరాడిసాధించుకున్న హక్కులన్నింటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాసేలా లేబర్ కోడ్స్ తీసుకొచ్చాయన్నారు. 8గంటల పని దినం స్థానంలో 12గంటలకు పెంచటమే కాక ఉన్న చట్టాలను నీరుగారుస్తున్నారన్నారు. ఇటీవల కార్మికుల హక్కుల కోసం దేశంలో జరిగే పోరాటాలు మే డే స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని తాజాగా కొద్ది రోజుల క్రితం నోయిడా పారిశ్రామిక కార్మికులు 8 గంటల పని విధానం అమలు చేయాలని, వెంటనే వేతన సవరణ చేసి జీతాలు పెంచాలని సామూహికంగా రోడ్డెక్కిన తర్వాత గాని యోగి ప్రభుత్వం స్పందించలేదన్నారు. యూనియన్ రిజిస్ట్రేషన్, యూనియన్‌కు యాజమాన్యం గుర్తింపు ఇవ్వడానికి తమిళనాడు శాంసంగ్ కార్మికులు 37 రోజుల నిరాకరించారన్నారు.


# జర్నలిస్ట్ జగన్మోహన్‌రెడ్డి హత్యకు ఖండన దుండగులను కఠినంగా శిక్షించాలి

## ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 28)
చిత్తూరు జిల్లా వి కోట ఆంధ్రజ్యోతి విలేకరి, సీనియర్ జర్నలిస్ట్ జగన్మోహన్‌రెడ్డిని దుండగులు హత్య చేయటాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏలు మంగళవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించాయి. దుండగులను కఠినంగా శిక్షించాలని, జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని వారు కోరారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు కోరారు. తక్షణం అటాక్స్ కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి భక్తవత్సలం, ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్ష కార్యదర్శులు, గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్‌వి బ్రహ్మం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కరిముల్లా, సునీల్, జిల్లా నాయకులు ఎల్ రాజు, ఏపీ బిజేఏ కన్వీనర్ పి కిరణ్‌లు తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటన పై ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జర్నలిస్టులంతా తమ నిరసనను వ్యక్తం చేయాలని కోరాం.

# మే 1వ తేదీన మెగా వైద్య శిబిరం

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 28)






మండలంలోని మేదరమెట్ల గ్రామంలో మే ఒకటో తేదీన వైసిపి రాజ్యసభ సభ్యులు, మాజీ టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎయిమ్స్ హాస్పిటల్ ఒంగోలు వారిచే మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ దగ్గర ఆనందరావు తెలియచేశారు. అన్ని విభాగాలకు సంబంధించి తొమ్మిది మంది ప్రముఖ డాక్టర్లు ఈ వైద్య శిబిరంలో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి మాజీ ఏఎంసీ చైర్మన్ వైవిభద్రారెడ్డి, వైసిపి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్‌లు పాల్గొని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ వైద్య శిబిరం నందు డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని ఆనందరావు తెలిపారు. కావున మండలంలో ఉన్న ప్రజలందరూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పోలీస్ స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

(షణ్ముఖ వెలుగు, సంతమాగులూరు, ఏప్రిల్ 28)
ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలి, పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని సంతమాగులూరు, బల్లికురవ పోలీస్ స్టేషన్ లను మంగళవారం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆకస్మికంగా తనిఖీచేశారు.

**స్టేషన్ రికార్డులు పరిశీలన**
**నమోదైన కేసులపై ఆరా**
**ట్రాఫిక్ నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలి**
**చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టి నివారించాలి**






అనంతరం పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న పలు రికార్డ్ లను పరిశీలించి, ప్రతి రికార్డు సంబంధించిన సమాచారాన్ని డిఎస్పీ, సిఐని అడిగి తెలుసుకున్నారు. నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలని, అలాగే పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, కేసుల పరిష్కారంలో జాప్యం వహించే కొలది బాధితులకు సత్వర న్యాయం అందించలేమని కనుక దానికి అనుగుణంగా పోలీస్ స్టేషన్ యొక్క నిర్వహణ ఉండాలని సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్‌లో అన్ని ఫైల్స్ సక్రమంగా అప్లోడ్ చేయాలని, కొత్త చట్టాల ప్రకారం ఎప్పటికప్పుడు వెబ్ అప్లికేషన్స్ అప్డేట్ లో ఉంచుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో నేర మరియు శాంతి భద్రతల పరిస్థితి గురించి, ఎక్కువగా జరిగే నేరాలపై అధికారులను ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణ,దొంగతనాల కట్టడి, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారని, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలని, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. పెండింగ్ కేసులు పురోగతి, దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నది మొదలగు అంశాలను గూర్చి ఆరా తీసి సదరు కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధానాలపై పోలీసులకు ఎస్పీ పలు సూచనలు చేసారు. స్టేషన్లో నిర్వహించే రికార్డ్స్ పెండింగ్ లేకుండా సక్రమంగా నిర్వహించాలని, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, ప్రాపర్టీని అధికారుల అనుమతితో డిస్పోసల్ చెయ్యాలని ఆదేశించారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు, రాత్రి ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని, అనుమానితులను మొబైల్ చెక్ డివైస్ ద్వారా తనిఖీ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, గ్యాంబ్లింగ్ తదితర నేరాలు జరగకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలని, లాడ్జిలను చెక్ చేయాలని, వాహనాలు తనిఖీ చేయాలని, కార్డన్ సెర్చ్ నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, మహిళలు, పిల్లలు సంబంధిత ఫిర్యాదుల పై తక్షణమే స్పదించాలని, పోలీస్‌శాఖ పై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పి పి బాలమురళీకృష్ణ, ఎస్బి సిఐ శ్రీనివాసరావు, సంతమాగులూరు సీఐ పి శేషగిరి, ఎస్ఐ యం పట్టాభి రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరం



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 28)
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచనల మేరకు అద్దంకి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల గుర్తింపు (అసెస్‌మెంట్–కమ్–రిజిస్ట్రేషన్) శిబిరం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అలింకో, సంక్షేమ శాఖల సమన్వయంతో జరిగిన ఈ శిబిరానికి నియోజకవర్గం నలుమూలల నుంచి 325 మంది లబ్ధిదారులు హాజరై నమోదు చేసుకున్నారు. వైద్య నిపుణుల బృందం ప్రతి ఒక్కరిని పరీక్షించి వారి అవసరాల మేరకు బ్యాటరీ మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, శ్రవణ యంత్రాలు, సాధారణ ట్రైసైకిళ్లు, జాయ్‌స్టిక్ మరియు ఫోల్డింగ్ వీల్‌చైర్లు, కమ్మోడ్ చెయర్లు, వాకర్లు, నడక కర్రలు తదితర పరికరాలకు ఎంపిక చేసింది. అదనంగా బ్రెయిలీ కేన్లు, సిలికాన్ కుషన్లు, ఇతర సహాయక పరికరాల కోసం కూడా రిజిస్ట్రేషన్లు చేపట్టారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి దివ్యాంగుడు, వృద్ధుడికి ప్రభుత్వ సహాయం అందాలన్న లక్ష్యంతో ఈ శిబిరం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. శిబిరంలో నమోదు అయిన లబ్ధిదారులకు త్వరలోనే అవసరమైన పరికరాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అలింకో ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సంక్షేమ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సెయింట్ ఆన్స్ క్యాంపస్‌లో టిసిఎస్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 28)
స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ప్రముఖ మల్టినేషనల్ సాఫ్ట్‌వేర్ సంస్థ టిసిఎస్ ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ మంతుల లక్ష్మణరావు వెల్లడించారు. 2026లో ఇంజినీరింగ్ పూర్తి చేసుకునే విద్యార్థుల కోసం టిసిఎస్ సంస్థ నిర్వహించిన ఈ ప్రాంగణ నియామకాలలో బి పల్లవికృష్ణ, కె చరణ్, పి దుర్గాప్రసాద్, లిఖితలకు వార్షిక రూ.3.40 లక్షల వేతనం, వి మల్లికార్జున్‌కు రూ.7.40 లక్షల ప్యాకేజీ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీశ్ బాబు తెలిపారు. విద్యార్థులకు రెండవ సంవత్సరం నుంచే సి, సి ప్లస్ ప్లస్, పైథాన్, యాప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని ప్లేస్‌మెంట్ అధికారి ఎన్ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ (అక్రిడిటేషన్స్) డాక్టర్ సి సుబ్బారావు, డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) వనమా దొర నాగ సాయినాథ్, సిఎస్ఇ విభాగాధిపతి డా. పి. హరిణి, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

# ఎస్ఐలు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలి




## దర్శి డీఎస్పీని డిమాండ్ చేసిన దళిత నేత నీలం

(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 28)
దర్శి సబ్ డివిజన్లో ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయకుండా ఎస్ఐ, సీఐలు అగ్రకుల నిందితులను రక్షిస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులను ఎఫ్ఐఆర్ గా నమోదు చేయించాలని దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ ను దళిత కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం దర్శి డిఎస్పి కార్యాలయంలో డిఎస్పిని కలిసి ఈ సంవత్సరం నాలుగో నెల ముగుస్తున్నా సబ్ డివిజన్ మొత్తంలో అద్దంకి పోలీస్ స్టేషన్లో ఒక్క ఎస్సీ, ఎస్టీ కేసు మాత్రమే నమోదు అయిందన్నారు. సంతమాగులూరు, అద్దంకి రూరల్, దర్శి సర్కిళ్లలో ఒక్క ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదు కాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులను నమోదు చేయకుండా ఎస్ఐలు, సిఐలు ఎస్సీ, ఎస్టీ చట్టానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ అమెండ్మెంట్ యాక్ట్ 2015 జీవో నెంబర్1 ప్రకారం ఎస్సీ ఎస్టీ బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు ఎటువంటి ప్రాథమిక విచారణ లేకుండానే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. అలాగే లలిత్ కుమార్, కాశ్మీర్ కేసులో సుప్రీంకోర్టు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదును ఎఫ్ఐఆర్‌గా నమోదు చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. చాలామంది ఎస్ఐలు సీఐలు ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులు నమోదు చేయకుండా బాధితులని భయపెడుతున్నారన్నారు. కౌంటర్ కేసు పెడతామని బెదిరిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్ల రాజీ చేస్తున్నారన్నారు. హాస్పటల్లో గాయపడి చికిత్స పొందుతున్న ఎమ్మెల్సీ లీగల్ కేసులను కూడా జనరల్ డైరీలో రాస్తున్నారు తప్ప ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయటం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయని పోలీసు అధికారులపై ఎస్సీ, ఎస్టీ బాధితుల పై కౌంటర్ కేసులు పెడుతున్న పోలీస్ అధికారుల పై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ సెక్షన్3(2) ప్రభుత్వ అధికారి చర్యల వలన ఎస్సీ, ఎస్టీలు బాధితులు అయినట్లయితే ఈ సెక్షన్ కింద ఉన్నతాధికారులు కేసు నమోదు చేయవచ్చు అన్నారు. ఈ సందర్భంగా దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణతో దర్శి సబ్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న మేదరమెట్ల ఎస్టి కులానికి చెందిన బాపట్ల భువనేశ్వరి కేసు నమోదు అయి 9 నెలలు అయినందున వెంటనే ఛార్జ్ షీట్ పెట్టాలని కోరారు. అలాగే బల్లికురవ మండలం సూరేపల్లి గ్రామంలోని గోగులమూడి నాగేంద్రం పై అగ్రకులాల దాడి ఘటనలో చార్జ్ షీట్ పరిశీలించి ఒంగోలు కలెక్టరేట్‌కు రిలీఫ్ ఫైల్ పంపాలని కోరారు. డిఎస్పిని కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ధారా అంజయ్య, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పట్రా బంగారం, యానాది పరిరక్షణ సమితి కన్వీనర్ జీవరత్నం, తదితరులున్నారు.

# ముగిసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన



## టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్) స్పాన్సర్ చేసిన మొదటి బహుమతి బుల్లెట్ బైక్ ను సొంతం చేసుకున్న హుజూర్ నగర్ గిత్తలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 28)

జాతీయ స్థాయి ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్రం హుజూర్ నగర్ కి చెందిన గిత్తలు సత్తా చాటి మొదటి బహుమతి గెలుచుకున్నాయి. మద్దిరాలపాడు గ్రామంలోని పీవీన్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మండవ వెంకటరావు మెమోరియల్ ఆధ్వర్యంలో వారం రోజులు పాటు నిర్వహించిన ఈ పోటీల్లో ఆదివారంతో ముగిశాయి. హుజూర్ నగర్ కి చెందిన గిత్తలు సత్తా చాటి మద్దిపాడు మండలానికి చెందిన యువ టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు సమకూర్చిన మొదటి బహుమతి బుల్లెట్ బైక్ ను సొంతం చేసుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన ప్రేక్షకుల కేరింతలు, చప్పట్ల నడుమ ఒంగోలు గిత్తల బండలాగుడు ప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఒంగోలు గిత్తలు ఉత్సాహం ఉరకలేస్తూ ఒకదానిని మించి మరొకటి అన్న విధంగా బండలాగి సత్తా చాటాయి. ఒంగోలు జాతి సీనియర్స్ విభాగంలో 2200 కిలోల బరువును 25 నిమిషాల వ్యవధిలో లాగేందుకు నిర్వహించిన బలప్రదర్శన పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన 14 జతల గిత్తలు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్ర హుజూర్ నగర్ కి చెందిన సుంకి సాకేత్, సారికా రెడ్డిల ఎడ్ల జత 3524.4 అడుగులు లాగి ప్రథమ బహుమతి సాధించాయి. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన కంది అంజిరెడ్డి బ్రదర్స్ జత 3041.10 లాగి రెండవ స్థానం, ప్రకాశం మద్దిరాలపాడులో ముగిసిన జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు। జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లు 3000 లాగి మూడో స్థానం, కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లపల్లి గ్రామానికి చెందిన అక్కినేని ముకుల్ సత్య చౌదరి, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన లంకిరెడ్డి నిక్షిత్ రెడ్డి గిత్తలు. 2726.8 లాగి నాల్గో స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కారసాని దివాకర్‌రెడ్డి, అదే జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెం గ్రామానికి చెందిన జిపి చౌదరి బుల్స్ కంబైన్డ్ గిత్తలు 2706.4 లాగి ఐదవ బహుమతి, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శీరీష, శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత 2700.6 లాగి ఆరవ బహుమతి, కృష్ణా జిల్లా విజయవాడ మండలం గన్నవరం గ్రామానికి చెందిన వల్లభనేని మోహనరావు ఎడ్ల జత 2700 లాగి ఏడవ బహుమతి, మార్కాపురం జిల్లా బోడిచెర్ల గ్రామానికి చెందిన తిండి నక్షత్రారెడ్డి గిత్తలు 24716 లాగి ఎనిమిదవ బహుమతి పొందాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పురుషోత్తమపట్నం గ్రామానికి చెందిన షేక్ సత్తార్ జత 2440.8 లాగి తొమ్మిదవ బహుమతి, నల్గొండ జిల్లా గుర్రంపూడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన సత్యనారాయణ గిత్తలు 22213 లాగి పదో బహుమతి, మార్కాపురం జిల్లా బేస్తవారిపేట మండలం జెసి ఆగ్రహారం గ్రామానికి చెందిన లక్కు శివసాయి. సాత్విక్ ఎడ్లు 2134.3 అడుగులు బండలాగి పదకొండవ బహుమతి సాధించాయి. ఎడ్ల యజమానులకు ఎంఎల్ఏ బిఎన్ విజయ్ కుమార్ నగదు బహుమతులను అందజేశారు. మూడు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులకు, ప్రజలకు, బహుమతులు స్పాన్సర్ చేసిన ప్రతి ఒక్కరికి గుమ్మడి సాయిబాబా నిర్వాహక కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.







# మాచర్ల అర్బన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కత్తి స్వర్ణలతకు ఘన సత్కారం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 28)

ఇటీవల మాచర్ల అర్బన్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కత్తి స్వర్ణలతను మంగళవారం మాచర్ల అర్బన్ పోలీస్ స్టేషన్ లో పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి బొకే అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మాచర్ల పట్టణానికి యంగ్ డైనమిక్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా స్వర్ణలత బాధ్యతలు చేపట్టటం గర్వంగా ఉందన్నారు. పట్టణంలోని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు పోలీసులకు మధ్య స్నేహ పూర్వక సంబంధాలు ఉండే విధంగా చూడాలని, ఎస్సీ, ఎస్టీల పై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు రిపోర్ట్ ఇచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ అయ్యేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోనే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు నివసించే ప్రాంతంలో యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, వారు అసాంఘిక కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్నారని అందుచేత పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అటువంటి ప్రాంతాలలో చట్టాల పట్ల అవగాహన కల్పించే విధంగా యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రతి నెల చివరి వారంలో గ్రామాల్లో నిర్వహించే పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమంలో పోలీస్ వారు హాజరయ్యే విధంగా చూడాలని, సమస్యలను పరిష్కరించాలని ఆమెను కోరారు. ఎస్ఐ స్వర్ణలత సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, సీనియర్ దళిత నాయకులు కర్రా చినరంగయ్య, బీసీ సంఘం మాచర్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొరదల జ్యోతి, దేరంగుల నాగలక్ష్మి తదితరులు పాల్గొని ఎస్ఐకి అభినందనలు తెలిపారు.

# గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 28)

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయం నందు మంగళవారం ఉచిత వేసవి విజ్ఞాజ్ఞ శిబిరం ప్రారంభమైంది. ఈ నెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు జరుగుతుంది. ఈ వేసవి సెలవుల్లో తమ పిల్లలను ఎక్కువ సంఖ్యలో గ్రంథాలయానికి పంపి సహకరించాల్సిందిగా కోరారు. మొదటి రోజు పిల్లలతో మొదటిగా పుస్తక పఠనం చేయించి అనంతరం వారికి మానసిక ఆనందం కోసం పరుగు పందెం పోటీలు నిర్వహించి అనంతరం వారికి కూల్ డ్రింక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 31 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథ పాలకుడు డి కోటేశ్వరరావు తెలిపారు.

# గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చరిత్రలో సువర్ణ అధ్యాయం

## విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్న నారా లోకేష్

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన

## విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 28)







ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, విద్యాపరంగా అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. వినుకొండ పట్టణం, అరుంధతి కాలనీ లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఎస్టీ హాస్టల్ భవనాన్ని పరిశీలించిన ఆయన, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థ గూగుల్, విశాఖపట్నంలో తన డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేయడం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అంశమని ఆయన కొనియాడారు. ఇది కేవలం ఒక పెట్టుబడి మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక గొప్ప మలుపు అని, దీని ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలోనే పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ నెంబర్ 1 స్థానంలో నిలవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడుతూ, జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. వైసీపీ హయాంలో రూ.9.70 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని మోసం చేశారని ధ్వజమెత్తారు. 2022 నాటికే పూర్తి కావాల్సిన ఎస్టీ గురుకుల పాఠశాలలను బిల్లులు చెల్లించకుండా మధ్యలోనే వదిలేశారని, ఇప్పుడు తమ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వాటిని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తోందని చెప్పారు. వినుకొండలో బీసీ విద్యార్థుల కోసం ₹35 కోట్ల భారీ వ్యయంతో నిర్మించబోయే గురుకుల భవనం విద్యా విప్లవంలో మరో మైలురాయి కానుందని తెలిపారు. గతంలో 'జాబ్ క్యాలెండర్' పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని, కానీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని జీవీ ఆంజనేయులు వివరించారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని, ఇది పేద కుటుంబాలకు కొండంత అండ అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు ప్రతి నెలా మూడవ శనివారం 'నో బ్యాగ్ డే' నిర్వహిస్తూ, క్రీడలను ప్రోత్సహించేందుకు గేమ్స్ కిట్స్ అందిస్తున్నామని చెప్పారు. మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ నిర్వహించడం ద్వారా పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన ప్రభుత్వ చీఫ్ విపు జీవి ఆంజనేయులు ఆమె పేరు మీద మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్‌బివిఆర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా 47వ వార్షికోత్సవం






(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 28)

ఎస్‌బివిఆర్ డిగ్రీ కళాశాలలో 47వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సమిష్టిగా పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా యోగి వేమన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ హాజరయ్యారు. గౌరవ అతిథిగా ఎస్‌బివిఆర్ విద్యాసంస్థల ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మ పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకట సుబ్బారెడ్డి కళాశాల స్థాపన నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, అందుబాటులో ఉన్న వసతులు, విద్యార్థుల ఉపాధి అవకాశాల కోసం అవసరమైన నైపుణ్యాలపై నివేదిక సమర్పించారు. ముఖ్య అతిథి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ, ఆశయం లేని విద్య తెలివితేటలు ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా ఉంటాయని, ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరగలరని సూచించారు. అలాగే జ్ఞానంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించే కోర్సులను ఎంపిక చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్య అతిథుల ప్రసంగాల అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ






(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 28)


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగాల సంఘం కనిగిరి వారి సౌజన్య పాద సోదకులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మంగళవారం కనిగిరి మున్సిపాలిటీలోని దేవకి ప్లాజా నందు ఏర్పాటైన వారి కార్యాలయం ముందర ఎండాకాలం దృష్టిలో పెట్టుకో గత 20 రోజుల నుంచి వచ్చే పోయే ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శిలు తమ్మినేని పెద్దిరెడ్డి, ఆర్ మల్యాద్రి, మాట్లాడుతూ ప్రజలు అవసరాలైతే పల్లె ప్రాంతం నుండి కనిగిరికి వస్తూ ఉంటారు వారిని ఎండల కాలం కావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుంది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అవస్థలను గమనించిన ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం కనిగిరి వారి అందరి సహకారంతో ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు ఉద్యోగులు తమకు వస్తున్న పెన్షన్ నుండి వారి వారి సహాయార్థంతో ఈ పనిని చేస్తున్నామని వారన్నారు ఈ కార్యక్రమం పలువురు విశ్రాంతి ఉద్యోగుల సంఘం చిలకల శివరాంరెడ్డి, నాగభూషణం వెంకటరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పాల్ పదిలం, మాలకొండారెడ్డి, బివి చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరి పెద్ద చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

## చెరువు వాగు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు
## ముంపుకు గురయ్యే ప్రాంతాల ముందస్తు పరిశీలన









(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 28)

కనిగిరి పట్టణంలోని పెద్ద చెరువును అధికారులతో కలిసి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. చెరువు అలుగు వాగు ద్వారా భవిష్యత్తులో ముంపుకు గురయ్యే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువులో పెద్ద ఎత్తున పెరిగిపోయిన చిల్లచెట్లు ను తక్షణం తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ “జల ధార- జల హారతి” కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వర్షాకాలం కంటే ముందే చెరువులను బాగు చేసి, నీటిని నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే కనిగిరి పెద్ద చెరువును అధికారులతో కలిసి పరిశీలించామని, చెరువు నిండి, వాగుల ద్వారా నీరు బయటికి వెళ్లే క్రమంలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి, భవిష్యత్తులో ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకోసం కనిగిరి సమగ్ర మాస్టర్ ప్లాన్ తయారుచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇది కేవలం వ్యక్తులకు సంబంధించిన విషయం కాదని, ప్రకృతి ప్రకోపానికి గురికాకుండా, భవిష్యత్తు ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు సుఖంగా జీవించాలనే తలంపుతోనే నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో వాగు ప్రవాహానికి అడ్డుగా ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించడం జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ చర్యల వల్ల ఎవరికైనా నష్టం వాటిల్లే పరిస్థితులు ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి వారికి న్యాయం చేసేందుకు ప్రయత్నించడం జరుగుతుందన్నారు. అధికారులు చేపట్టే పనులకు ఆటంకం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పోలీస్, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

# ఇంధన కొరత పై ప్రజలు ఆందోళన చెందవద్దు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 28)

ఇంధన కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ప్రజలకు తెలిపారు. మంగళవారం మార్కాపురం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలకు పెట్రోల్ డీజిల్ నింపుకునేందుకు అక్కడికి వచ్చిన వారికి పలు సూచనలు చేశారు. వాహనదారులు కావలసినంత మాత్రమే పెట్రోల్ డీజిల్ కొనుగోలు చేయాలని సూచించారు. భయంతో డ్రమ్ములు, క్యాన్ల కు నింపుకోవద్దని తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించారు. అనంతరం అక్కడ ఉన్న స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ చిరంజీవి, ఇతర సిబ్బంది ఉన్నారు.

# వాహనదారులు ఆందోళన చెందవద్దు
# పెట్రోల్ బంకులను రెండో రోజు ఆకస్మిక తనిఖీలు

## నిర్వహించిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు
## పెట్రోల్, డీజిల్‌కు ఎటువంటి కొరత లేదు



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 28)

ప్రకాశం జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను తొలగించేందుకు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు అద్దంకి పట్టణంలోని వీఎస్ఆర్ పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా బంక్‌లలో ఉన్న ఇంధన నిల్వలు, సరఫరా పరిస్థితులు, విక్రయ విధానాలపై అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడి, పెట్రోల్, డీజిల్ సరఫరా సక్రమంగా కొనసాగించాలని సూచించారు. ఎటువంటి అంతరాయం లేకుండా వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అలాగే బంకు నిర్వాహకులు ఇంధనాన్ని కేవలం వాహనాలకు మాత్రమే నింపాలని, క్యాన్‌లలో నింపరాదని ఆదేశించారు. క్యాన్‌లలో నింపడం వలన బ్లాక్ మార్కెట్‌కు తరలించే అవకాశం ఉందని, అందువల్ల ఈ విధానాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంధన నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ, జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఇంధన సరఫరాలో ఎటువంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. ఇంధన పంపిణీలో అక్రమాలు జరగకుండా మరియు శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రతి పెట్రోల్ బంకు వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో పెట్రోల్, డీజిల్ కొరతపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పుకార్లు ప్రజల్లో ఆందోళనలకు దారి తీసే అవకాశం ఉన్నందున వాటిని నమ్మకూడదని, షేర్ చేయవద్దని సూచించారు. అదనంగా, ప్రజలు డీజిల్ పెట్రోలు కొనుగోళ్లు చేయకుండా కేవలం అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికంగా ఇంధనం నిల్వ చేయడం లేదా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం చట్టపరమైన చర్యలు తప్పమన్నారు. జిల్లా ఎస్పీ వెంట దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ, ఎస్బి సిఐ శ్రీనివాసరావు, అద్దంకి సీఐ సుబ్బరాజు, సిబ్బంది ఉన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com